క్లుప్తంగా

ప్రథమ చికిత్సపై అవగాహన అవసరం


సర్టిఫికెట్లు అందజేస్తున్న ప్రసాదరావు

విజయనగరం ఫోర్ట్: ప్రథమ చికిత్సపై ప్రతి ఒక్కరూ శిక్షణ తీసుకోవాలని రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ కె.ఆర్.డి ప్రసాదరావు అన్నారు. స్థానిక రెడ్ క్రాస్ సొసైటీ కార్యాలయంలో శనివారం క్రీడా అభివృద్ధి శాఖ సిబ్బందికి ఫస్ట్ ఎయిడ్ శిక్షణ సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రథమ చికిత్సతో ప్రాణాలు కాపాడవచ్చునన్నారు. ఎముకలు విరిగినప్పుడు, అగ్నిప్రమాద బాధితులకు, పాముకాటుకు, ప్రమాదాలు జరిగి గుండె ఆగినప్పుడు సీపీఆర్ విధానం వంటి అంశాలపై శిక్షణ ఇచ్చారు. జిల్లా క్రీడా అభివృద్ధి అధికారి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ క్రీడల నిర్వహణ సమయంలో ఏదైనా అనుకోని ప్రమాదాలు జరిగితే తక్షణమే ప్రథమ చికిత్స అందించేందుకు ఈ శిక్షణ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ జిల్లా కో–ఆర్డినేటర్ గౌరీశంకర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు నేత్రవైద్య శిబిరం

మెరకముడిదాం: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(పీహెచ్‌సీ)లో విశాఖపట్నానికి చెందిన శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచితనేత్ర వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు ఆస్పత్రి సిబ్బంది వెంకటరావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. శిబిరంలో శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి సిబ్బంది నేత్ర పరీక్షలు చేసి, శస్త్ర చికిత్సలు అవసరమైన వారిని గుర్తిస్తారని చెప్పారు. శస్త్ర చికిత్సలకు ఎంపికైన వారికి శంకర్ ఫౌండేషన్ ఆస్పత్రిలో ఉచితంగా ఆపరేషన్ చేయిస్తామని తెలిపారు. నేత్ర సమస్యలు ఉన్న మండల వాసులు ఈ శిబిరాన్ని సద్వినియోగించుకోవాలని సూచించారు.

పారిశుద్ధ్య పనులు

వేపాడ: మండలంలోని జగ్గయ్యపేట గ్రామంలో పంచాయతీ కార్యదర్శి పర్యవేక్షణలో మూడు రోజులుగా పారిశుద్ధ్య పనులు ముమ్మరంగా చేపడుతున్నారు. వీధి కాలువల్లో పేరుకుపోయిన పూడిక, చెత్తను కార్మికులు తొలగించారు. దోమలు నివారణకు తగుచర్యలు తీసుకుంటున్నామని పంచాయతీ కార్యదర్శి తెలిపారు. ప్రజలు పరిసరాల పరిశుభ్రత పాటించాలని పంచాయతీ సిబ్బంది సూచించారు.

20 నుంచి చినకాద గ్రామ దేవత పండగ

దత్తిరాజేరు: మండలంలోని చినకాద గ్రామంలో ఈనెల 20వ తేదీ నుంచి మూడు రోజుల పాటు గ్రామ దేవత నల్లమారమ్మ పండగ నిర్వహించను న్నట్లు కమిటీ సభ్యులు శనివారం తెలిపారు. 20న తొలేళ్ల ఉత్సవం, 21న రథోత్సవం, 22న కనుమ పండగ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మూడు రోజుల పాటు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామని కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

మాజీ సర్పంచ్‌కు డాక్టరేట్

పూసపాటిరేగ: మండలంలోని సీహెచ్ అగ్రహారం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ నల్ల అప్పలరాజుకు డాక్టరేట్ లభించింది. బెంగుళూరు భరత్ విరట్యువల్ (బీవీ) యూనివర్సిటీ వీసీ చేతులు మీదుగా డాక్టరేట్ పట్టా అందుకున్నారు. వివిధ ఆధ్యాత్మిక అంశాలపై ఆయన చేసిన పరిశోధనకుగాను డాక్టరేట్ లభించింది. అప్పలరాజు కార్మిక నాయకుడిగా కార్మికులకు సహకారం అందిస్తూ, పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు.

పండ్లతోటల సాగుకు ప్రోత్సాహం


రాజాం: ఉపాధి హామీ పథకంలో న్యూ స్ట్రాటజీ వర్క్స్ అమలు జరుగుతున్నాయని, వాటితో రైతులకు ఎంతో మేలు జరుగుతుందని ఉపాధి హామీ పథకం ఏపీడీ మీసాల శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పలు గ్రామాలకు చెందిన టెక్నికల్ అసిస్టెంట్లతో శనివారం సమావేశమైన ఆయన.. న్యూ స్ట్రాటజీ పనుల్లో భాగంగా రైతులు తమ పొలాల్లో పండ్లతోటలు పెంచుకునేందుకు ప్రోత్సాహం, ప్రోత్సాహకం కల్పిస్తున్నామన్నారు. మొత్తం 14 రకాల పండ్లతోటల మొక్కలను రైతులకు ఉచితంగా అందిస్తామన్నారు.

ఎకరాకు 60 నుంచి 70 వరకు మొక్కలు ఇవ్వనున్నామన్నారు. వీటిని నాటడంతో పాటు మూడేళ్ల పాటు పెంచుకునేందుకు ఏడాదికి రూ.35 వేల వరకు నిధులను ఉపాధి హామీ పథకం ద్వారా అందుతాయన్నారు. మొక్కల ఫలసాయం కూడా రైతులే పొందవచ్చన్నారు. వీటితో పాటు పొలాల చుట్టూ కందకాలు తవ్వకునేందుకు, చెట్లు, మొక్కలు చుట్టూ కూడా కందకాలు ఏర్పాటుకు రైతులకు నిధులు ఇస్తున్నామన్నారు. వీటి కోసం రైతులు ఫీల్డ్ అసిస్టెంట్‌ల వద్ద దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఎకరం నుంచి మూడెకరాల వరకు పొలాలున్న రైతులు తమ మెట్టు ప్రాంత పొలాల్లో పారం పాండ్‌లు తవ్వకునేందుకు నిధులు కేటాయిస్తున్నామన్నారు. 9 మీటర్ల వెడల్పు, 9 మీటర్ల పొడవుతో పాటు లోతు రెండు మీటర్ల మేర తవ్వకోవాలన్నారు. వీటి నిర్మాణాలకు సైతం రైతులకు రూ.50 వేల వరకు నిధులు వెచ్చిస్తామన్నారు. ఏపీఓ కె.సాయిరాం, ఈసీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక సందడి


జామి: పుష్పగిరిలో పూజలందుకుంటున్న వేణుగోపాలస్వామి


మెరకముడిదాం: బుధరాయవలసలో వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు


గజపతినగరం:గజపతినగరంలో పూజలందుకుంటున్న వేంకటేశ్వర స్వామి


జామి: కన్యకాపరమేశ్వరి జయంతి సందర్భంగా లక్ష్మీపురంలో సామూహిక కుంకుమపూజలు చేస్తున్న మహిళలు


శృంగవరపుకోట: బొడ్డవర గ్రామంలో వాసవీమాతకు పూజలు చేస్తున్న ఆర్యవైశ్య మహిళలు


గజపతినగరం: గజపతినగరం వేంకటేశ్వరస్వామి ఆలయంలో విష్ణు సహస్రనామ పారాయణం చేస్తున్న మహిళలు

జామి: అన్నంరాజుపేట పంచాయతీ, పుష్పగిరి గ్రామంలోని పురాతన, ప్రసిద్ధిగాంచిన వేణుగోపాలస్వామి ఆలయంలో శనివారం విశేష పూజలు చేశా రు. అర్చకులు స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామి వారిని దర్శించుకుని, అభిషేకాలు చేశారు. అనంతరం అలాగే భీమసింగి సుగర్ ఫ్యాక్టరీ వద్ద ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో..

మెరకముడిదాం: మండలంలోని బుధరాయవలస గ్రామంలో గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో స్వామి వారి 331వ ఆరాధన సందర్భంగా ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలువురు దంపతులతో స్వామివారి కల్యాణం జరిపించారు. మధ్యాహ్నం ఆలయం వద్ద సుమారు 2 వేల మందికి అన్నదానం చేశారు. సాయంత్రం స్వామివారి ఉత్సవ విగ్రహాలను ఊరేగించా రు.

వేంకటేశ్వరస్వామి ఆలయంలో..

గజపతినగరం: స్థానిక వేంకటేశ్వరస్వామి ఆలయంలో అర్చకులు శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారిని వివిధ పుష్పాలతో అలంకరించారు. మండల కేంద్రంతో పాటు చుట్టు పక్క గ్రామాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారికి అభిషేకాలు పూజలు చేశారు. మహిళలు విష్ణు సహస్రనామ పారాయణం చేశారు.

కన్యకాపరమేశ్వరి జయంతి వేడుకలు

శృంగవరపుకోట: ఆర్యవైశ్యుల కులదేవత శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి జయంతి వేడుకలను శనివారం జామి, ఎస్.కోట మండలాల్లో ఆర్య వైశ్యులు ఘనంగా నిర్వహించారు. అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేకంగా కుంకుమ పూజలు, అభిషేకాలు చేశారు. బొడ్డవర గ్రామంలో అమ్మవారికి 108 రకాల నైవేద్యాలను సమర్పించారు. అనంతరం భా రీ అన్నసమారాధన చేశారు. కార్యక్రమాన్ని వాసవీ వనితా క్లబ్ అధ్యక్షురాలు కోటి రత్నం పాల్గొన్నారు.

వాసవీమాతకు పూజలు

జామి: మండలంలోని లక్ష్మీపురం గ్రామంలో వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో కన్యకాపరమేశ్వరి అమ్మవారి జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. మహిళలు సామూహిక కుంకుమ పూజలు చేశారు. అనంతరం అన్నదానం చేశారు. మండల వాసవీ క్లబ్ అధ్యక్షుడు యిండుపూరి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

తగాదాలకు దూరంగా ఉండాలి


వేపాడ: బక్కునాయుడుపేట గ్రామస్తులతో సమావేశమైన సీఐ ఉపేంద్ర, ఎస్ఐ రాజేష్


లక్కవరపుకోట: కళ్లేంపూడిలో మాట్లాడుతున్న సీఐ ఉపేంద్ర

లక్కవరపుకోట: ఇటీవల సార్వత్రిక ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకున్నామని, అలాగే ఎన్నికల ఫలితాలు వెలువడే వరకు ప్రజలు సంయమనం పాటించా లని, తగాదాలకు దూరంగా ఉండాలని ఎస్.కోట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ హెచ్. ఉపేంద్ర ప్రజలకు సూచించారు. మండలంలోని కళ్లెంపూడి గ్రామస్తులతో శనివారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ ఎన్నికల కోడ్ ముగిసే వరకు గ్రామాల్లో సభలు, సమావేశాలు నిర్వహించరాదన్నారు.అలాగే బాణసంచా కాల్చడం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం వంటివి చేయరాదన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎస్ఐ ఆర్.గోపాలరావు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

పండగలు అట్టహాసంగా నిర్వహించవద్దు

వేపాడ: సార్వత్రిక ఎన్నికల కోడ్ అమలులో ఉందని, గ్రామదేవతల పండగలు నిర్వహించాలనుకునే వారు పండగలను అట్టహాసంగా చేయవద్దని ఎస్.కోట సీఐ ఉపేంద్ర సూచించారు. మండలంలోని బక్కునాయుడుపేట గ్రామస్తులతో శనివారం రాత్రి ఆయన సమావేశం నిర్వహించారు. గ్రామస్తులు గ్రామ దేవత పండగ నిర్వహించాలని నిర్ణ యించుకున్నట్లు తెలియడంతో సీఐ వారికి పలు సూచనలు చేశారు. పండగను పురస్కరించుకుని సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయకూడదని, బాణసంచా కాల్చ డం, విక్రయించడం చేయరాదన్నారు. నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. వల్లంపూడి ఎస్ఐ కె.రాజేష్, కానిస్టేబుల్ నాయుడు, గ్రామపెద్దులు పాల్గొన్నారు.

విజ్ఞానదాయకంగా వేసవి శిబిరాలు


ఎస్.కోట: గ్రంథాలయంలో విద్యార్థులతో కథల పుస్తకాలు చదివిస్తున్న లైబ్రేరియన్ శ్రీధర్


చీపురుపల్లి: గ్రంథాలయంలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వక్తలు

చీపురుపల్లిరూరల్: శాఖా గ్రంథాలయాల్లో నిర్వహిస్తున్న వేసవి శిబిరాలు విద్యార్థులు, చిన్నారుల్లో విజ్ఞానాన్ని పెంపొందించేందుకు ఎంతో దోహదపడతాయని పలువురు వక్తలు అన్నారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా చీపురుపల్లి శాఖా గ్రంథాలయంలో లైబ్రేరియన్ ఏ.బుచ్చంనాయుడు ఆధ్వ ర్యంలో ఉపాధ్యాయుడు ఎం.లచ్చన్న, జన విజ్ఞాన వేదిక అధ్యక్షుడు వి.మోహనరావు, సభ్యుడు జి.రమణ విద్యార్థులకు శనివారం పుస్తక పఠనం, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులతో కథల పుస్తకాలు చదివించి, ఆ కథల సారాంశాన్ని వివరించారు. పిల్లలకు స్పోకెన్ ఇంగ్లిష్‌పై శిక్షణ ఇచ్చారు.

ఎస్.కోటలో..

శృంగవరపుకోట: వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా స్థానిక శాఖాగ్రంథాలయంలో లైబ్రేరియన్ శ్రీధర్ విద్యార్థులతో శనివారం పుస్తక పఠనం చేయించడంతో పాటు వారితో నీతికథలు చెప్పించారు. విద్యార్థులకు ఇష్టమైన ఆటలు ఆడుకునే అవకాశం కల్పించారు. పలు పాఠశాలల విద్యార్థులు హాజరయ్యారు.

రెండు పూటలా పనులు చేయాలి


వేతనదారులకు సూచనలు చేస్తున్న ఇన్‌చార్జి ఏపీఓ నరేంద్రకుమార్

మెరకముడిదాం: ఉపాధి పనులను రోజూ రెండు పూటలా చేయాలని ఉపాధి హామీ పథకం ఏపీఓ నరేంద్రకుమార్ వేతనదారులకు సూచించారు. భైరిపురం గ్రామంలోని జగ్గమ్మచెరువులో చేపడుతున్న ఉపాధి పనులను శనివారం ఆయన పరిశీలించారు. మస్టర్ల సీట్ల తనిఖీల అనంతరం ఆయన వేతనదారులతో మాట్లాడుతూ ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్ ఇచ్చిన కొలతల ప్రకారం పనులు చేస్తేనే ప్రభుత్వం నిర్దేశించిన రోజు వారీ గరిష్ఠ వేతనం రూ.300 అందుతుందన్నారు. జాబ్ కార్డులో పేరు ఉన్న వారే పనులకు హాజరు కావాలని, ఒకరికి బదులు వేరొకరు పనులకు రాకూడదన్నారు. పని ప్రదేశంలో వేతనదారుల కోసం టెంట్లు, ప్రథమచికిత్స కిట్లు, తాగునీరు అందుబాటులో ఉంచాల్సిన బాధ్యత ఫీల్డ్ అసిస్టెంట్, మేట్లదేనని తెలిపారు. ఆయన వెంట ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీనివాసరావు ఉన్నారు.

దివ్యాంగ చిన్నారుల గుర్తింపు సర్వే


సర్వేను పరిశీలిస్తున్న జిల్లా అధికారులు

చీపురుపల్లిరూరల్(గరివిడి): సమగ్రశిక్ష అభియాన్, విద్యాశాఖ ఆధ్వర్యంలో బడి ఈడు దివ్యాంగ చిన్నారుల గుర్తింపు సర్వేను భవిత కేం ద్రాల ప్రత్యేక ఉపాధ్యాయులు నిర్వహిస్తున్నారు.గరివిడి మండలంలోని బి.జె.పాలెం,దేవాడ, కాపుశంబాం గ్రామాల్లో శనివారం చేపట్టిన సర్వేను జిల్లా సహిత విద్య కో–ఆర్డినేటర్ ఎస్.సూర్యారావు, సహ కో–ఆర్డినేటర్ ఎం .భారతి పరిశీలించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ దివ్యాంగులైన బడి ఈడు పిల్లలందరినీ పాఠశాలల్లో చేర్పించడమే ఈసర్వే ప్రధాన ఉద్దేశమని తెలిపారు. దివ్యాంగ విద్యార్థుల కోసం ప్రభుత్వం అనేక సౌకర్యాలు కల్పిస్తోందన్నారు. దివ్యాంగులు చదువుకునేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా మండల కేంద్రంలో భవిత కేంద్రాలను నిర్వహిస్తోందని తెలిపారు. ఈ కేంద్రాల్లో ప్రత్యేక ఉపాధ్యాయులు ఉన్నారని తల్లిదండ్రులు తమ పిల్లలను ఈ కేంద్రాల్లో చేర్పించాలని కోరారు. పాఠశాలలో చేరిన వారందరికీ వివిధ రకాల ఉపకరణాలను అందిస్తామని తెలిపారు. ప్రత్యేక ఉపాధ్యాయులు ఈశ్వరరావు, సుమలత తదితరులు పాల్గొన్నారు.

రామతీర్థంలో వైశాఖమాస పూజలు


స్వామి సన్నిధిలో భజన చేస్తున్న ఉత్తరాంధ్ర కళాకారులు

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం సీతారామస్వామి దేవస్థానానికి శనివారం భక్తులు పోటెత్తారు. వైశాఖ మాసం కావడంతో ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని, ఆలయ క్షేత్రపాలకులైన ఉమా సదాశివుడిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు స్వామి సన్నిధిలో ప్రత్యేక హోమాలు, సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ధర్మపథం కార్యక్రమంలో భాగంగా కళాకారుల సంఘం జిల్లా ప్రతినిధి అట్టాడ పైడిరాజు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భక్తి భజనలు ఆకట్టుకున్నాయి. శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలకు చెందిన కళాకారులు సుమారు 3 గంటల పాటు భక్తి భజనలు చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పంపిణీకి సిద్ధంగా పచ్చిరొట్ట విత్తనాలు

శృంగవరపుకోట: రైతులకు రాయితీపై పంపిణీ చేసేందుకు పచ్చిరొట్ట విత్తనాలు సిద్ధంగా ఉన్నాయని ఏఓ రవీంద్ర శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. భూసారం పెంచేందుకు దోహదం చేసే కట్టె జనుమ, జీలుగ, పిల్లిపెసర విత్తనా లు రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. 10 కిలోల జనుమ, జీలుగు విత్తనాలప్యాకెట్లు రూ. 440కు, 8కిలోల పిల్లిపెసర విత్తనాలు రూ. 536 కు ఇవ్వనున్నట్టు స్పష్టం చేశారు. విత్తనాలు కావాల్సిన రైతులు రైతు భరోసా కేంద్రాల్లో ఆధార్‌కార్డును చూపించి, ఫోన్ నంబర్ ఇచ్చి నమోదు చేసుకుని, విత్తనాలు తీసుకోవచ్చని చెప్పారు.

మంత్రి బొత్స పరామర్శ


ఆదినారాయణను పరామర్శిస్తున్న మంత్రి బొత్స సత్యనారాయణ

విజయనగరం: గత కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ కార్పొరేటర్ నడిపిల్లి ఆదినారాయణను రాష్ట్ర విద్యాశాఖా మంత్రి బొత్స సత్యనారాయణ శనివారం పరామర్శించారు. ఈ నెల 13న జరిగిన సార్వత్రిక ఎన్నికల పోలింగ్ నాడు తీవ్ర అస్వస్థతకు గురైన ఆదినారాయణకు కుటుంబ సభ్యులు నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. మంత్రి బొత్స సత్యనారాయణ శనివారం సాయంత్రం ఆస్పత్రికి వెళ్లి ఆదినారాయణను పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిపై కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రి వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని సూచించారు.

కోలగట్ల గెలుపు ఖాయం


మాట్లాడుతున్న కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ వీరవెంకట రాజేశ్వరరావు

విజయనగరం: సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరగడం ప్రజాస్వామ్య విలువలకు నిలువుటద్దంగా నిలిచాయని విజయనగరం ఎంపీపీ మామిడి అప్పలనాయుడు, కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ శెట్టి వీరవెంకట రాజేశ్వరరావు అన్నారు. డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి నివాసంలో శనివారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. గ్రామ సచివాలయ వ్యవస్థ ఏర్పాటుతో గాంధీజీ కలలుకన్న గ్రామ స్వరాజ్యాన్ని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సాకారం చేశారన్నారు. అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా సమసమాజ స్థాపనకు కృషిచేశారన్నారు. స్థానిక ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామి నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా పనిచేశారన్నారు. రాష్ట్రంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అందించిన సుపరిపాలనకు మద్దతుగా పెద్ద ఎత్తున ప్రజానీకం పోలింగ్‌లో పాల్గొన్నారన్నారు. నియోజకవర్గంలో కోలగట్ల మరోసారి శాసన సభ్యుడిగా ఎన్నికవడం, జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి సీఎంగా బాధ్యతలు చేపట్టడం ఖాయమని ఆశాభావం వ్యక్తం చేశారు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు మద్దతిచ్చిన ఓటర్లకు, పార్టీ గెలుపు కోసం అహర్నిశలు కష్టపడి పనిచేసిన పార్టీ శ్రేణులకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ శ్రేణులు, కార్పొరేటర్లు ఇకపై ప్రజా సమస్యలపై దృష్టి సారించాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి అధికార యంత్రాంగం కృషిచేయాలని కోరారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు ఆశపు వేణు, మండల అధ్యక్షుడు నడిపేన శ్రీనివాసరావు, జోనల్ ఇన్‌ఛార్జిలు బొద్దాన అప్పారావు, మారం బాలబ్రహ్మారెడ్డి, ముచ్చు శ్రీనివాసరావు, దూబే, బోడసింగి ఈశ్వరరావు, వివిధ డివిజన్‌ల కార్పొరేటర్లు అల్లు చాణక్య, బండారు ఆనందబాబు, వివిధ డివిజన్ల నాయకులు, మండల పార్టీ నాయకులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ విజయం తథ్యం

నెల్లిమర్ల రూరల్: ఇటీవల జరిగిన సాధారణ ఎన్నికల సరళి వైఎస్సార్‌సీపీకే అనుకూలంగా ఉందని ఎంపీపీ అంబళ్ల సుధారాణి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అంబళ్ల శ్రీరాములనాయుడు అన్నారు. శనివారం వారు విలేకరులతో మాట్లాడుతూ..అన్ని వర్గాల ప్రజలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాల రూపంలో లబ్ధి చేకూర్చారన్నారు. ప్రజలు వాస్తవాలనే స్వీకరించారని, పెరిగిన పోలింగ్ శాతం తమ పార్టీకే అనుకూలంగా ఉంటుందన్నారు. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యేగా బడ్డుకొండ అప్పలనాయుడు మరోసారి ప్రమాణ స్వీకారం చేస్తారన్నారు. గ్రామాల్లో ఎన్నికలు సజావుగా జరిగేందుకు, వైఎస్సార్‌సీపీ విజయానికి కృషిచేసిన సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, పార్టీ శ్రేణులకు ధన్యవాదాలు తెలిపారు.

బాలికలను కంటికి రెప్పలా కాపాడుకోవాలి

బొబ్బిలి: బాలికలను కంటికి రెప్పలా కాపాడుకోవాలని బొబ్బిలి అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి ఎం.రోహిణీరావు సూచించారు. ప్రపంచ బాలికల అదృశ్య నివారణా దినం సందర్భంగా మండలంలోని మెట్టవలస గ్రామ సచివాలయంలో బాలికల సంరక్షణపై అవగాహన సదస్సు శనివారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ దేశంలో ఈ మధ్యకాలంలో బాలికలు, చిన్నారులు, మహిళలు ఎక్కువగా అపహరణకు గురవుతున్నారని, ఎవరైనా అదృశ్యమైన వెంటనే పోలీసులు, న్యాయ సేవా కమిటీకి తెలియజేయాలన్నారు. తల్లిదండ్రులు తమ బిడ్డల సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాది డి.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.